గడపగడపకూ సంక్షేమం.. ఇంటింటా సంతోషం

బుట్టాయగూడెం : పేదలకు అందించే సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావులేకుండా ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అంది స్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దొరమామిడిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గడచిన నాలుగేళ్లల్లో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. అలాగే మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటి తలుపులకు అతికించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగా గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లంరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, చింతలపూడి వెంకట నారాయణ, కాళింగి వెంకటేశ్వరరావు, తెల్లం సిహాచలం, సోయం వెంకటరామయ్య, ఎంపీడీవో ఎం.శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దొరమామిడిలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు


ములగలంపల్లిలో బుక్‌లెట్‌ను అందజేస్తున్న దృశ్యం


పైడిపాకలో జగనన్న స్టిక్కర్‌ను అతికిస్తున్న సచివాలయాల మండల కన్వీనర్ పార్థసారథి

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించి రాబోయే ఎన్నికల్లో అఖండ విజయంతో గెలిపించాలని జీలుగుమిల్లి వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు గంటసాల గాంధీ కోరారు. ములగలంపల్లి సచివాలయ పరిధిలో రెండో రోజు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి జగనన్న స్టిక్కర్‌లను అతికించారు. ములగలంపల్లి సచివాలయ పరిధిలో నాయకులంతా సమిష్టిగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పేరాబత్తుల వెంకటరత్నం, ఘంటశాల సత్యనారాయణ, త్రిమూర్తులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాగులగూడెంలో మా నమ్మకం నువ్వే జగన్

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని నాగులగూడెం పంచాయతీ పైడిపాక గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల ఇళ్లకు జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా కన్వీనర్ పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాగులగూడెం సచివాలయ కన్వీనర్ నిట్టా బాలయ్య, ఉప సర్పంచ్ అరుణ, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంజన్న సన్నిధిలో...


ఎమ్మెల్యే వాసుబాబుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకి అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. మల్నీడి బాబి, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ స్వామి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకి అందజేశారు.

ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ తరగతులు


ఏఎంసీ యార్డులో ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక ఏఎంసీ మార్కెట్ యార్డ్ భవన ప్రాంగణంలో ఉద్యాన శాఖ అధికారి ఎస్.ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో నాలుగు మండలాల పరిధిలోని రైతు భరోసా కేంద్ర సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సర్మిలాకార తెల్ల దోమ నివారణ, పంట, సస్యరక్షణ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. దోమపోటుకు గురైన పంటలను గుర్తించే విధానం, సిబ్బందికి ఉన్న సందేహాలకు ఆమె సమాధానం ఇచ్చారు. కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పరింపూడి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం


వార్షికోత్సవ సంబరాల్లో ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొయ్యలగూడెం : పరింపూడి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు మట్టా బాల త్రిపురేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో జె.సురేష్‌బాబు మాట్లాడుతూ నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వం పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయన్నారు.

వినియోగదారుల సంఘాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొయ్యలగూడెం: ధాన్యం సేకరణలో ప్రభుత్వానికి, రైతులకు మధ్య వినియోగదారుల సంఘం సహాయపడగలదని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం వివిధ ఆర్‌బీకే సెంటర్ల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నా, సాంకేతిక కారణాల వలనో లేదా తేమ శాతం సరిగా లేకపోవడం, ఇతర కారణాల వలనో రైతులు ధాన్యాన్ని విక్రయించడానికి అడ్డంకులు ఏర్పడితే జిల్లా జాయింట్ కలెక్టర్ లేదా జిల్లా సివిల్ సప్లయిస్ అధికారిని గాని లేదా 83097 89845,, 98662 25868 ఈ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పోలవరం రూరల్ : రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని హోంమంత్రి తానేటి వనితకు రైతులతో కలిసి వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దత్తి రాంబాబు వినతిపత్రం సమర్పించారు. మండలంలో అత్యధిక శాతం మొక్కజొన్న పంట వేశారని, దళారుల చేతుల్లో రైతులు నష్టపోతున్నారని, రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జ్వరాలపై అపోహలు వద్దు

గణపవరం : సీజనల్ జ్వరాలపై అపోహలు వీడాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని గుర్తించాలని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని మొయ్యేరు గ్రామంలో ప్రజలకు అంటువ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. టైఫాయిడ్, డెంగీతో పాటు అనేక రకాల అంటు వ్యాధులకు మూలం అపరిశుభ్రత, దోమల పెరుగుదల కారణమన్నారు. గ్రామాలలో వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు, దోమల వ్యాప్తి, నివారణ, ఫ్రైడే డ్రైడేగా పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే నిర్వహించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించడం ద్వారా అంటు వ్యాధులను దూరం చేయవచ్చన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని సుబ్బంపేటలో కొలువైన షిర్డీ సాయినాథుని ఆలయం 30వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కె.మోహన్‌శర్మ ఆధ్వర్యంలో బాబాకు పంచామృతాభిషేకాలు, పుష్పార్చన, విశేష అలంకరణ, పల్లకీసేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. బుట్టాయగూడెం సోంబాబు బృందంచే ఆలయంలో భజన, భక్తిగీతాలు నిర్వహించినట్లు ధర్మకర్త తన్నీరు రమేష్ తెలిపారు.

సంఘటిత పోరాటాల ద్వారానే హక్కుల పరిరక్షణ

జంగారెడ్డిగూడెం: సంఘటిత పోరాటాల ద్వారానే హక్కుల పరిరక్షణ సాధ్యమని ఇఫ్టూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా ఇఫ్టూ ఆల్ ఇండియా కమిటీ ప్రచురించిన గోడప్రతులను బుధవారం బోసు బొమ్మ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, ఉన్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలి

టి.నరసాపురం : స్థానిక సహకార సంఘంలో రుణాలకు సంబంధించి సెక్షన్ 51 ఎంక్వైరి త్వరలోనే ముగియనుందని కైకలూరుకు చెందిన సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అబ్దుల్ హాదీ తెలిపారు. గత మూడు నెలలుగా ఈ విచారణ కొనసాగుతోంది. సంఘం నుంచి పొందిన రుణాల నిర్ధారణలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. విచారణ ముగుస్తున్నందున అభ్యంతరాలు ఉన్నవారు వెంటనే తమ అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు. సెక్షన్ 51 ఎంక్వైరి పూర్తయిన తరువాత ఎటువంటి అభ్యంతరాలు స్వీకరించబడని తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల ఘర్షణ.. ఒకరికి తీవ్ర గాయాలు

చింతలపూడి: యర్రగుంటపల్లిలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లికి చెందిన కల్లెపల్లి యోహాను, సంఘసాని శ్రీను పెయింటింగ్ పనులు నిర్వహిస్తుంటారు. వీరు గురువారం యర్రగుంటపల్లిలో ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ జరగడంతో , యోహాన్ తన చేతిలోని కర్రతో శ్రీనును కొట్టాడు. అనంతరం ఆ కర్రను లాక్కొని శ్రీను దాడి చేయడంతో యోహాన్ తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన యోహాన్‌ను స్థానికులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యావికాస్ విజయభేరి

జంగారెడ్డిగూడెం: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో విద్యావికాస్ విద్యార్థులు విజయభేరి మోగించినట్లు కళాశాల యాజమాన్యం పి.సతీష్‌చంద్, వి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 464 మార్కులు ఎం.దివ్యశ్రీ, ఎస్.నిహారిక, ఎం.స్నేహిత, పిరామలక్ష్మి సాధించగా, 463 మార్కులు బి.పృధ్వీ, ఎం.దివ్య, కె.యోగిని సత్య దివ్య, జి.భవిష్యతకీర్తి సాధించారన్నారు. అలాగే బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను కె.లక్ష్మీ ఐశ్వర్య 432, ఎస్.సౌమ్య 428, జి.వైష్ణవి 427, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను కె.అంజన 986, కె.ఉషా కిరణ్మయి 985, వి.అంజనికుమార్, కె.శ్యామల 981, పి.ధనశ్రీ రామ్, ఎస్.రష్మిత 980 మార్కులు సాధించారన్నారు. అలాగే బైపీసీ విభాగంలో పి.జ్వలితశ్రీ 981, పి.ప్రవంతి 977, పి.గాయత్రి 975 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

బుట్టాయగూడెం : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రథమ సంవత్సరం 52 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం 77 శాతం ఉత్తీర్ణులయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ భక్తహనుమాన్ తెలిపారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 207 మంది విద్యార్థులకు గాను 107 ఉత్తీర్ణులు కాగా ద్వితీయ సంవత్సరంలో 171 మందికి గాను 131 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) విద్యార్థిని మడివి కావేరి 1000 మార్కులకు గాను 963 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా మొదటి సంవత్సరానికి ఎంఎల్‌టీకి సంబంధించి తోట వివేక్ కుమార్ 500 మార్కులకు 480 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వివేక్ కుమార్‌ను కళాశాల అధ్యాపకులు అభినందించారు.


జిల్లా టాపర్‌గా నిలిచిన వివేక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గురుకులం విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: ఇంటర్ ఫలితాల్లో జంగారెడ్డిగూడెం అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.అరుణ తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 66 మందికి 41 మంది ఉత్తీర్ణులై 62 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఎంఈసీ గ్రూపునకు సంబంధించి బి.హేమశ్రీ 861 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించిందన్నారు. అలాగే జూనియర్ ఇంటర్ 56 మంది విద్యార్థులకు 24 మంది ఉత్తీర్ణులై 43 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంఈసీలో బి.హేమశ్రీ, వాసే అనుష్క 467 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు.

సత్తా చాటిన శ్రీవెంకటేశ్వర విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటి విజయదుందుభి మోగించారని జంగారెడ్డిగూడెం శ్రీవెంకటేశ్వర కళాశాల యాజమాన్యం తెలిపింది. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఎల్.అమూల్య, ఎ.అఖిల 464 మార్కులు, పి.భానుసూర్య 463 మార్కులు, ఈ.హారిక, జి.మోహన్ శ్రీనివాస్, కేఎ లక్ష్మి 462 మార్కులు, ఆర్.భాగ్యశ్రీ, ఎం.రుషికేశ్‌కుమార్, ఆర్.చంద్రముఖి, బి.డి.ఎస్.శ్రీవల్లి 461 మార్కులు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను ఎం.కే ప్రశాంతిదేవి 433, డి.మానిక 429, బి.దేవీశ్రీ 428, డి.కీర్తన 427, పి.శ్రీనాగదుర్గ 425, ఎస్‌కే ఆశ, సీహెచ్ మహాలక్ష్మి 424 మార్కులు, సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను ఎం.నిర్మల 473, ఆర్.సుందరం 472, ఎస్.రాజశ్రీ 461, కేఎస్ లక్ష్మి 461, ఎ.పవన్‌కళ్యాణ్ 460 మార్కులు సాధించినట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు గాను ఎంపీసీలో కె.శివరామకృష్ణ 983, కె.విజయజ్యోతి 982, ఆర్‌హెచ్‌డీఎస్ అమృత 982, కేఎస్ లిల్లీ గ్రేస్ 980, బైపీసీ విభాగంలో కె.శ్రీహర్షిత 988, పీఎస్‌పీ వర్షిత 984, ఎం.వెంకటలక్ష్మి 982, టి.సాత్విక 981, సీఈసీ విభాగంలో బి.కాశీ దుర్గ 935, జె.సమీక్ష 910 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం విద్యార్థులను కళాశాల డైరెక్టర్‌లు, అధ్యాపకులు అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రం అందజేత


సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : పోలవరం పంచాయతీ పరిధిలోని నూతనగూడానికి చెందిన బి.సాయి ఈశ్వర్‌కు వైద్యం నిమిత్తం రూ.2 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాన్ని గురువారం ఎమ్మెల్యే బాలరాజు పోలవరంలో ఈశ్వర్ తండ్రి సురేష్‌కు అందేశారు. ఈశ్వర్ రక్తకణాలు దెబ్బతినడం వల్ల నుదిటిపై గడ్డలా వచ్చిందని, శస్త్రచికిత్స నిమిత్తం రూ. 25 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు తెలపడంతో ఎమ్మెల్యే బాలరాజుకు తమ గోడు చెప్పగా ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేశారని సురేష్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎంపీటీసీలు దాపర్తి మోహన్‌రావు, యాల శ్రీదేవి, కుంజం చిట్టెమ్మ, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గూటికి పంచాయతీ వార్డు సభ్యుడు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో నాలుగు నెలల క్రితం వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి చేరిన పంచాయితీ 5వ వార్డు సభ్యుడు కలకండ రామకృష్ణ తిరిగి గురువారం వైఎస్సార్ సీపీ గూటికి చేరాడు. ఈ సందర్భంగా రామకృష్ణకు గ్రామ సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజు పార్టీ కండువాను కప్పి, ఆహ్వానించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ నేతలు చెప్పిన మాయమాటలు విని ఆ పార్టీలోకి వెళ్లి తప్పు చేశానని అన్నాడు. ఇక వైఎస్సార్ సీపీని వీడేది లేదని స్పష్టం చేశాడు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిపాటి చిన్న సోమేశ్వరరావు, దిర్శిపాం అన్నవరం తదితరులున్నారు.


రామకృష్ణకు వైఎస్సార్ సీపీ కండువాను కప్పుతున్న సర్పంచ్ సిద్ధిరాజు

ఘనంగా భగీరథ జయంతి

జంగారెడ్డిగూడెం : కఠోర శ్రమకు, దీక్షకు ప్రతీక భగీరథుడు అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం భగీరథ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుని చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దివి నుంచి భువికి గంగను తీసుకువచ్చే క్రమంలో భదీరథుని అచంచలమైన దీక్షను మనం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సగర కులస్తులు సగరులను బీసీ ఈ నుంచి మార్చాలని ఎమ్మెల్యేను కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పార్టీ పట్టణాధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, నాయకులు బత్తిన చిన్న, సగర రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సాగరబోయిన వరలక్ష్మి, వైస్ ఎంపీపీ ఎస్.శ్రీనివాస్‌రావు, కె.చిన్న, కె.మారేసు, కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భగీరథ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

మే 9 నుంచి ఉత్సవాలు

పెదపాడు : అప్పనవీడు శ్రీ అభయాంజనేయస్వామి ఉత్సవాలు మే 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ కమిటీ చైర్మన్ నెర్సు నాగభూషణం, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సుంకర సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను గురువారం విడుదల చేశారు. తొలుత అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, శృంగారం వెంకట శేష రామానుజాచార్యులు పూజలు చేశారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

కొయ్యలగూడెం : కల్పవృక్షం పేరిట ఏర్పాటైన వృద్ధాశ్రమాన్ని గురువారం రోటరీ క్లబ్, వృద్ధాశ్రమ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రారంభించారు. లాయర్ కృష్ణావతారం మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ భవనాన్ని వారసులైన కిళంబి వెంకటాచార్యులు వృద్ధాశ్రమ నిర్వహణకు అందజేసినట్లు క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మద్దు గోపి ,అధ్యక్ష కార్యదర్శులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, సంకుకొండ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మాదేటి అప్పలరాజు, సెక్రటరీగా ఎస్‌కే అమీర్ భాష, ఉపాధ్యక్షుడిగా గొలిసెట్టి వాసు, ట్రెజరర్‌గా ఏ.విశ్వనాథశర్మ నియమితులయ్యారు. ఈ వృద్ధాశ్రమంలో 60 నుంచి 75 ఏళ్ల లోపు వయసు కలిగిన వృద్ధులకు ఆశ్రయం కల్పించబడుతుందన్నారు. వివరాలకు 93468 12194, 85007 36777 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.


వృద్ధాశ్రమాన్ని ప్రారంభించిన రోటరీ క్లబ్, వృద్ధాశ్రమ నిర్వాహకులు

చలివేంద్రాల ఏర్పాటు

జంగారెడ్డిగూడెం : స్థానిక గంగానమ్మగుడి సెంటర్‌లో సూర్య ఎలక్ట్రానిక్స్ అధినేత రాజాన సత్యనారాయణ, రాజాన కిరణ్‌రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని గురువారం డీఎస్పీ కేవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా 300 లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం డీఎస్పీని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పెనుమర్తి రాంకుమార్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, బంగారు సూర్యనారాయణ, సాయల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో కృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో స్థానిక యూనియన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ ప్రారంభించారు. మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

జీడి మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

జంగారెడ్డిగూడెం : గిట్టుబాటు ధర లేక జీడి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 80 కేజీల బస్తా జీడి పిక్కలకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జీడి మామిడి పంటకు మద్దతు ధర - ప్రభుత్వం కొనుగోలు అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జీడి పిక్కలు ధర బస్తా రూ.8 వేలు మాత్రమే ఇస్తున్నారని, దీని వలన జీడి మామిడి రైతులు వ్యాపారుల చేతిలో దోపిడీకి గురి అవుతున్నారని అన్నారు. జీడిమామిడి రైతులకు న్యాయమైన ధర చెల్లించి ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జీడి మామిడి రైతు మాంద్రు సూర్య చంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అందుగుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూమి సారవంతం

కామవరపుకోట : నవధాన్యాలతో భూమి సారవంతం అవుతుందని సేంద్రియ వ్యవసాయ కామవరపుకోట మండలం తడికలపూడి క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జ్ కె.వెంకటలక్ష్మి అన్నారు. గురువారం తడికలపూడి రైతు భరోసా కేంద్రంలో ఐసీఆర్‌పీలకు నవధాన్యాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనిటీ ఇన్‌ఛార్జ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందుతారని అన్నారు, 30 రకాల విత్తనాలతో 250 నవధాన్యాలు గల కిట్స్ తయారు చేసి రైతులకు ఇచ్చి వాటి వల్ల ఉపయోగాలు గూర్చి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శోభారాణి, నవీన్న, వి.ఏ.ఏ. అనూహ్య, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళను కొట్టి గాయపర్చిన నేరంపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం స్వర్ణవారిగూడెంకు చెందిన పసుపులేటి వెంకటలక్ష్మి నరసమ్మకు మండలంలోని పట్టెన్నపాలెం గ్రామంలో 4.27 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో పామాయిల్ మొక్కలు వేసి సాగు చేసుకుంటున్నారు. ఈ నెల 19న పొలంలో పనిచేస్తుండగా, పుసుపులేటి రత్తమ్మ, తొమ్మిదేళ్ల సుబ్బలక్ష్మి, తొమ్మిదేళ్ల సూర్యచంద్రరావు, తొమ్మిదేళ్ల రవికుమార్ పొలంలోకి ప్రవేశించి నరసమ్మను కొట్టి గాయపర్చారని, అలాగే చంపుతానని బెదిరించినట్లు నరసమ్మ ఫిర్యాదులో పేర్కొంది. నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

పోలవరం రూరల్ : మామిడిగొంది ప్రాంతంలో సారా తయారు చేస్తున్న తోటగొంది గ్రామానికి చెందిన కలుం మహేష్‌ను 10 లీటర్ల సారాతో పట్టుకున్నట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నాటు సారా తయారీ కోసం ముడిసరుకును విక్రయిస్తున్న వ్యాపారస్తులకు హెచ్చరికలు జారీ చేశారు. సారా తయారు చేయడం నేరమని, ఇందుకు సహకరించినవారు కూడా శిక్షార్హులన్నారు.

14 ద్విచక్ర వాహనాల వేలం

కొయ్యలగూడెం : వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వేలం నిర్వహించారు. మొత్తం 14 వాహనాలను వేలం నిర్వహించగా లక్షా 74 వేల యాభై రూపాయల ఆదాయం వచ్చిందని పోలీసులు తెలిపారు. పోలవరం ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాస్ బాలాజీ ఆధ్వర్యంలో వాహనాల వేలం నిర్వహించారు.